# గుణపాఠం

ఆ వార్త విన్నప్పటినుండీ నర్సిగాడి ఆనందం చెప్పనలవి గాకుండా ఉంది.

గుండెలు తేలికగా.

మనసు హాయిగా.

శరీరం దూదె పింజలా.

కోరికలు చుక్కలు చూస్తూ.

ఆలోచనలు అడ్డదిడ్డంగా.

మనిషి ఏమిటేమిటోగా అయిపోతున్నాడు.

ఇదీ నిజమా ! ఇదే నిజమయితే ఓ నెల రోజులు తను మహారాజు. ఒకడ్ని దేబిరించకుండా కాలుమీద కాలేసుకొని, కడుపులో సుక్కేసుకొని హాయిగా తొంగుంటారు. సెంద్రి ఒళ్ళో పడుకొని సుక్కల లోకం సూస్తాడు.

నర్సిగాడు ఆనందంగా అడుగులు వేస్తూ కల్లుపాక దగ్గరకు నడిచాడు. కల్లుపాక ముందు పెద్ద బాననిండా కల్లు పెట్టుకొని, దాని వెనుక పీటమీద కూర్చొని ఉంది చుక్కమ్మ. కల్లు బానమీద తెల్లని గుడ్డకప్పి ఉంది. అక్కడున్న ముగ్గురు మనుషులు తాటాకుతో దోనెలు చేసి పట్టుకొని చుక్కమ్మ దగ్గర కొచ్చారు. అవి కల్లు పోయించుకొని త్రాగడానికి అనువుగా ఉంటాయి. చుక్కమ్మ మట్టిముంత నిండుగా కల్లుముంచి తాటాకు దోనెల్లో పోస్తూ ఉంది. ఆనందంగా త్రాగి ఏవేవో మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు వాళ్ళు.

నర్సిగాడు చుక్కమ్మని సమీపించి పందిరిగుంజకు ఆనుకొని జారిగిలబడి కూర్చొని కాళ్ళు పారజాపాడు.

"ఏయ్ సుక్కా ఓ ముంత కల్లు బొయ్యే" అన్నాడు దర్జాగా. అక్కడే పడిఉన్న ఒక తాటాకు దోనె చేత్తో పట్టుకొని.

"దొరలాగ అడుగుతున్నావు గదరా. ఇప్పటివరకూ పోసిన పది ముంతలకు దిక్కులేదు గాని, మళ్ళీ ముంత పోయాలంట ముంత."

"ఏందే తమాసా బడుతున్నావ్. నీ కియ్యాల్సిన పది రూపాయలకి ఎంత మాటలంటుందవే. ఇంతలావు మొగమడిసిని బట్టుకొని."

"ఆ....మా మొగమడిసివిలే. మగమడిసయినోడు ముందు డబ్బు లిచ్చి తరువాత కల్లు అడుగుతడు."

నర్సిగాడు తీక్షణంగా చుక్కమ్మవైపు చూసాడు. ఆ చూపులకే శక్తిఉంటే చుక్కమ్మ కాలిపోయేది.

"అంతేనంటావా" అన్నాడు.

"అంతే" అంది చుక్కమ్మ.

"సరే అయితే ఇక ఈ రోజుతో నీ ఖాతా రద్దు. ఇకనుంచి నేను రంగి దగ్గరే లెక్కపెడతా" దోనె విసరిగొట్టి లేచి నిలుచున్నాడు నర్సిగాడు.

రంగమ్మ, చుక్కమ్మకు ప్రత్యర్థి. చుక్కమ్మ కల్లు అంగడి ఊరికి ఉత్తరం వైపుంటే రంగమ్మ కల్లు అంగడి ఊరికి దక్షిణంవైపు నుంది. వీళ్ళ పోటీకి ఖాతాదారులు సగం అటు ఇటు ఉన్నారు. నర్సిగాడు ఎంత అరువు బాకీ గాడైనా ఎప్పుడో ఒకప్పుడు నమ్మకంగా ఇచ్చేవాడు. చుక్కమ్మ ఈ ఖాతాదారుని పోగొట్టుకోదలచలేదు.

అందుకే నర్సిగాడి చేయిపట్టుకొని "రేయ్ నర్సిగా, తమాషాకు అంటే అట్నే ఎల్లిపోవడమేనా కూసో కూసో. కల్లు బెమ్మాండంగా

ఉందది. ఓ ముంత తాగి పోదువు" అంటూ వాణ్ని లాగి కూర్చో బెట్టింది.

"ఏటనుకున్నావు నా దెబ్బ రొండు రోజులు ఆగే ఒక్కసారి అయిదొందలు వచ్చి పడ్తాయి. అప్పుడు సూద్దువుగాని నా తడాకా" అంటూ క్రిందపడి ఉన్న తాటాకు దోనె చేతిలోకి తీసుకొని ఆమె కల్లు బాన కెదురుగా గొంతు కూర్చొన్నాడు.

"ఏందిరో అయిదొందలు రూపాయలు రొండు రోజుల్లో సంపాయిత్తా నంటున్నావ్, తుపాను వస్తదీ" హాస్యంగా అన్నాడు అప్పుడే వచ్చిన గంగడు.

నర్సిగాడు ఏం మాట్లాడకుండా కల్లు నిండిన దోనె నోటి దగ్గర పెట్టుకొని గటగటా త్రాగసాగాడు. చుక్కమ్మ దగ్గర తన విలువ పెర గడంతో ఇంకో ముంత కూడా పోయించుకొని కడుపునిండా తాగి "బ్రేవ్" మని తేన్చాడు.

తరువాత నర్సిగాడు ఆ పందిరి క్రిందనే ఎండుచేపలా వెల్లికిలా పడుకున్నాడు.

"నర్సిగా ఎట్టా సద్దో కాస్త సెప్పరా అంత డబ్బు నేమూ ఇంటా" నర్సిగాడ్ని ఉబ్బిస్తూ ఎంతో అనునయంగా మాట్లాడింది చుక్కమ్మ.

"ఆ ఏముంది గంగడే సెప్పాడు గదా ఇప్పుడు."

"నానేం సెప్పాన్రా. నువు అంత డబ్బు సంపాదిస్తే తుఫాను వస్తదని సెప్పినా. అంతే" అన్నాడు గంగడు అయోమయంగా.

"పిచ్చి నాయాలా అద్గదేరా అసలు రహస్యం" పగలబడి నవ్వాడు నర్సిగాడు.

"అంటే"

"అంటే ఏంది పొద్దన సెప్పలా రేడియాలో తుఫాను వొసద్దని. ఎంత ఈ రాత్తిరికి తుఫాను వొస్తే, రేపు రాతిరికల్లా నా యింటికి డబ్బు

లొస్తయి" ఇంతవరకూ తన ఆనందానికి కారణమయిన అసలు సంగతి జెప్పాడు.

"ఓరి ఎర్రినాయాలా అదంట్రా సంగతి. ఎక్కడ కొంపా, గోడు కొట్టుకుపోద్దో అని మేమంతా పొద్దున్నుంచి భయపడి సత్తా ఉంటే నీకింత ఆనందంగా ఉందా" అంటూ గంగడు ముక్కుమీద వేలేసుకొన్నాడు.

"తుఫానొచ్చినా, ఊరు మునిగిపోయినా వాడికేం బావ గంగ మావా. ఒంటి కట్టెవాడు ఎవుడి కోసం ఏడత్తాడు" అంది చుక్కమ్మ.

"బలే సెప్పినవు సుక్కమ్మా" కల్లు త్రాగి వెళ్ళిపోయాడు గంగయ్య.

నర్సిగాడు అక్కడే క్రింద పడుకొని నిద్రపోయాడు.

ఆ వూరి కాపురస్తులయిన నారయ్య, సుబ్బమ్మ దంపతులకు వాళ్ళ కంటూ ఒక పూరిల్లు, పది సెంట్ల భూమి తప్ప మరేమీ లేవు. నారయ్య, సుబ్బమ్మ దంపతులు ముసలివాళ్ళయి నెల తేడాలో మొదట నారయ్య, తరువాత సుబ్బమ్మ ఈ లోకం విడిచి వెళ్ళిపోయారు. చివరకు ఆ ఆస్తికి వాళ్ళ సంతానమయిన వీరయ్య నర్సయ్య వారసులయ్యారు.

నర్సిగాడి అన్న వీరగాడికి అప్పటికే పెళ్ళయి ఒక బిడ్డ ఉంది. తల్లి దండ్రులు పోయిన తరువాత ఇద్దరూ ఆస్తి పంపకాలు చేసుకొన్నారు. ఆ పంపకాలలో అన్న వీరిగాడికి పది సెంట్ల భూమిచ్చి, తను పూరిల్లు తీసు కొన్నాడు. అంతా నర్సిగాడ్ని పిచ్చోడన్నారు. బంగారం పండేపొలం వదిలాడంటే పిచ్చివాడుగాక మరేంది అనుకొన్నారు.

నర్సిగాడి ఆలోచన ఇంకో విధంగా ఉంది. పొలముంటే దానమ్మ నాయాల్ది సంవత్సరం పొడుగునా దాంతో పని. దున్నాల, ఇత్తనాలు చల్లాల, కలుపు తీయాల, నీళ్ల పెట్టాల, మందు కొట్టాల, ఆనక కాపలా. ఇంతా జేసి కొసలో తుఫాను కొడితే గింజ చేతికి దొరకదు. అదే తను ఇల్లు తీసుకొంటే హాయిగా నీడ నుండొచ్చు. తుఫానువల్ల పంటకు

నష్టం. అయితే ఇల్లువల్ల తనకు లాభం. ఇల్లు పడిపోతే డబ్బిస్తారు. అదీ గాక గత ఎనిమిదేళ్ళ నుంచి ఏటా తుఫాన్లు వొస్తున్నాయి. ఏటా ఏంది ? ఆరు నెల్లకే తుఫాను వస్తూంది. అంటే సంవత్సరానికి ఏయి రూపాయలు. ఇవీ నర్సిగాడి ఆలోచనలు.

నర్సిగాడి ఆలోచనలకు తగ్గట్లే కార్యరూపంలో కూడా అదే కలసి వచ్చింది. అతని వాటాకు ఇల్లు తీసుకొన్న సంవత్సరమే తుఫాను వచ్చి కొట్టంలాంటి ఇల్లు కూలిపోయింది. గోడలు పడి ఇల్లంతా ముక్కోణపు ఆకారంలో నేలమీద ఆనుకొంది. దానిని బాగుచేసుకోమని ప్రభుత్వంవారు ఆ సంవత్సరం అయిదువందలు రూపాయలు ఇచ్చారు. కాని వాడు ఇంటిని బాగుచేసుకోలేదు. ఇంటిని కదిలించకుండా దాన్నే నివాస యోగ్యంగా చేసుకొని కాపురం చేస్తున్నారు. మోకాళ్ళమీద దూరి లోపలికి పోతాడు. వాడికి ఉండేది రెండు పంచెలు, రెండు తుండుగుడ్డలు; అదే వాడి ఆస్తి.

వాడికి పెళ్ళి కాలేదు. ఆ ఊళ్ళో చంద్రమ్మ ఇంటి దగ్గర కూలి గింజలు ఇచ్చి కూడు వండించుకొని తింటాడు. ఒక్కొక్కసారి గుబులు మళ్ళితే చంద్రమ్మ పక్కలోనే వెచ్చగా పడుకొంటాడు. చంద్రమ్మ మొగుడు పట్నంలో రిక్షా లాగుతుంటాడు. ఇన్ని కారణాల వల్ల నర్సిగాడికి పెళ్ళి ఆవశ్యకత లేకుండా పోయింది. ఇష్టమున్న నాడు కూలికి పోవడం, తినడం, తాగడం, ఆ పడిపోయినింట్లో రాత్రిళ్ల ముడుక్కోవడం ఇదీ వాడి పరిస్థితి.

గత ఏడు సంవత్సరాలుగా వాడు ఆ కూలిపోయిన ఇంటినే పదే పదే చూపించి ప్రభుత్వం దగ్గర డబ్బు వసూలు చేస్తున్నాడు. వాడికి ప్రభుత్వం మీద ఎంతో నమ్మకం. తనలాంటి బీద, బిక్కీ అంటే ప్రభుత్వానికి

ఎంతో అభిమానమని వాడు దాన్ని ఆధారం చేసుకొని "అయ్యా! నూటికి లేనోడ్ని, కొంప కొట్టుకుపోయింది. సహాయం చేయండి దేముడో" అంటూ అధికారుల కాళ్ళమీద పడి ఏడుస్తూ ప్రభుత్వ సహాయం పొందుతున్నాడు.

వాడి నోటికి భయపడి కొందరు, తమ విషయాలు బయటపడతాయని మరికొందరు ఆ గ్రామస్తులు భావించడంతో వాడి రహస్యం బయట పడలేదు. దాంతో వాడి వ్యాపారం ఏటా జోరుగా సాగిపోతోంది.

* * * *

ఆ అర్థరాత్రి నర్సిగాడి కోరిక మన్నించినట్లుగా చలిగాలి సన్నగా మొదలైంది. ఒకటొకటిగా చినుకులు పడసాగాయి. తెల్లవారింది కాని సూర్యోదయం కాలేదు. సన్నగా వీస్తున్న గాలి ఉధృతమైంది. ఆ ఉధృతానికి చెట్లకొమ్మలు ఊగుతున్నాయి. గుడిసెలమీది తాటాకులు రాకెట్లలా రివ్వురివ్వున ఎగిరిపోతున్నాయి. హోరుమని శబ్దంచేస్తూ వీస్తోంది గాలి.

ఆ ఉదయం పశువుల్ని, మేకల్ని ఎవరూ బయటికి విప్పలేదు. గ్రామస్తులు జారిపోతున్న గుండెల్ని బిగపట్టుకొని ఇండ్ల దగ్గరే ఉండి పోయారు. ఇలాంటి సమయాల్లో నర్సిగాడు బహుజాగ్రత్తగా ఉంటాడు. ఇంట్లో ఉన్న ఒక పంచె, తుండు సంచిలో పెట్టుకొని, ఎలిమెంటరీ స్కూల్లో పడుకొంటాడు. తుఫాను తగ్గితేనే బయటకు రావడం. ఎవరయినే తిండిపెడితే తింటాడు లేదా ప్రభుత్వం ఏదైనా ఆహారం పొట్లాలు పంపితే ఇక్కడుండే తనకు తప్పకుండా అందుతాయనేది వాడి నమ్మకం.

నర్సిగాడు, చంద్రమ్మ ఇంటికి వెళ్ళి "ఇదే చివరి గంజి" అనుకొంటూ కడుపునిండా గంజిత్రాగి, ఎలిమెంటరీ స్కూల్లో వచ్చి పడుకున్నాడు కమ్మని కలలుగంటూ.

మధ్యాహ్నం దాటేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. హోరు

మని వీస్తున్న గాలితోబాటు, కుండపోతగా వర్షంకూడా మొదలయ్యింది. గ్రామస్తులు గొడ్డూ గోదని, మేకల్ని, గొర్రెల్ని కట్లు విప్పేసారు. గొడ్లు 'రంకెలు' వేస్తూ, మేకలు 'మే' అని అరుస్తూ వీధుల్లో అటూ ఇటూ పరుగెత్తుతున్నాయి.

చీకటి పడేసరికి వర్షం, గాలి ఎక్కువయ్యాయి. పూరిళ్ళలోని గ్రామస్తులంతా మూటా, ముల్లె సర్దుకొని ఊరికి కొద్దిదూరంలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్లోకి రావడం మొదలుపెట్టారు. నిర్విచారంగా ఒకమూల పడుకొని ఉన్న నర్సిగాడు ఈ గందరగోళానికి విసుక్కొంటూ లేచి కూర్చున్నాడు. కొద్దిసేపట్లో ఎలిమెంటరీ స్కూలు క్రిక్కిరిసిపోయింది. ఆ వాతావరణంలో పిల్లలు గోలగా ఏడుస్తున్నారు. ఆడా, మగా ఏవేవో చర్చిస్తున్నారు. నర్సిగాడికి అక్కడ ఇంతమంది రావడం విసుగ్గా ఉంది. అయినా వాడు తన కూలిపోయిన ఇంటిమీద రాబోయే డబ్బు గురించి కమ్మని కలలు కనడం మాత్రం మానలేదు.

భయంకరమైన శబ్దంతో గాలి వీస్తోంది. ఉధృతమైన వర్షాన్ని ఈదురుగాలి అటూ ఇటూ ఈడ్చికొడుతోంది. ఎన్నో ఇళ్లు కూలిపోయాయి. పెద్ద పెద్ద చెట్లు వ్రేళ్ల పైకిలేచి తిరగబడ్డాయి. రోడ్లు తెగాయి. కాలువలు నదులయ్యాయి. చెరువు తెగి ఊరిమీద పడింది నీరు. ఆ రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడిపారు గ్రామస్తులు. ఎలిమెంటరీ స్కూలు మిట్టప్రదేశంమీద ఉండడంతో చెరువు నీరు దానికి తగల్లేదు.

తెల్లవారేసరికి వాతావరణం ప్రశాంతంగా మారిపోయింది. సూర్యుడు తెల్లగా ప్రకాశిస్తూ తూర్పున వెలిసాడు. ఊరంతా జలమయమయింది. ఎన్నో ఇళ్ళు కూలిపోయాయి. ఇళ్ళలోని సామానంతా కొట్టుకుపోయింది. అసలు ఊరే రూపురేఖలు లేకుండా మారిపోయింది. తమ పశువుల్ని, ఇళ్ళను పోగొట్టుకొన్నవారు భోరున ఏడుస్తున్నారు. పడిపోయిన ఇళ్ళను

సరిజేసుకొంటున్నారు. కొట్టుకుపోయిన వస్తువులు ఎక్కడ చెట్లకు తగులు కున్నాయో, వెతుక్కొని దొరికినవి తెచ్చుకుంటున్నారు.

అందరూ వెళ్ళిన తరువాత ఆఖరుసారిగా నర్సిగాడు తన సంచి చేతబట్టుకొని ఎలిమెంటరీ స్కూల్లోనుంచి బయటపడి ఊరివైపు నడవ సాగాడు. వాడికి దిగులూ, విచారమూ లేదు. అవి లేకపోగా పెదవులమీద చిరునవ్వు మెరుస్తూ ఉంది.

ఎలిమెంటరీ స్కూలునుంచి ఊరివైపునున్న మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి గుంటలు మిట్టలుగా ఉంది. చేలలోంచి గెనిమలు పొర్లి వచ్చే నీళ్ళు ఇంకా రోడ్డుమీద పారుతున్నాయి. ఎక్కడినుంచో కొట్టుకు వచ్చిన పాములు ప్రవాహవేగం తగ్గడంవల్ల రోడ్డుకు అటూ, ఇటూ ఉన్న ముండ్ల పొదలకు చుట్టుకొని తలలు నిక్కబెట్టి చూస్తున్నాయి. మట్టిరోడ్డు మీద నీరు ప్రవహిస్తూండటంతో వాటికి దిగడానికి భయమేస్తోంది.

నర్సిగాడు జాగ్రత్తగా అడుగులువేస్తూ, గుంటలను తప్పించుకొంటూ విషజంతువులను గమనిస్తూ ఊళ్ళోకి వచ్చాడు. ఊళ్ళో పిల్లా పెద్దా రోదనలు వాడికేమీ బాధనిపించలేదు. కాని కల్లు వ్యాపారంచేసే చుక్కమ్మ, రంగమ్మ ఇళ్ళు కుండలతో సహా కొట్టుకుపోయాయని తెలిసి చాలా బాధపడ్డాడు. తనకు రేపు డబ్బులు వస్తే, ఎక్కడ కల్లు దొరుకుతాయా అనేది వాడి చింత.

వాడు మెల్లగా తన గుడిసె దగ్గరకు చేరుకొన్నాడు ఆ దృశ్యం చూసి స్థాణువడిపోయాడు నర్సిగాడు. "అరె, ఏది తన ఇల్లు ? ఏమై పోయింది ? పొరపాటున తను ఇంకొక చోటుకి వచ్చానేమోనని కళ్ళు చికిలించుకొని చూసాడు. అతని అనుమానం నిజంకాదు. తను నిజంగానే తన ఇంటికి వచ్చాడు. ఉత్తరపువైపు గంగడి ఇల్లు కూలి ఉంది.

దక్షిణపువైపు వీరాస్వామి ఇల్లు గోడలు కొట్టుకొనిపోయి బోసిగా ఉంది. ఊరికి పడమరవైపు నుంచి తూర్పువైపు పారే పంటకాలువ అలాగే ఉంది కానీ, దాని గట్టునే ఉండాల్సిన తన కూలిన ఇల్లు మాత్రం లేదు.

తన ఇల్లు ఉండాల్సిన స్థలంలో పెద్ద అగాధమేర్పడి కాలువలో కలసిపోయింది. అక్కడ ఇల్లు ఉన్నట్లు ఏ గుర్తూలేదు. ఇల్లు సామానులతో సహా పూర్తిగా కొట్టుకుపోయింది. చెరువు తెగడంవల్ల కాలువ పొంగి ఆ ప్రవాహ వేగానికి అందునే ఉన్న నర్సిగాడి ఇల్లు పూర్తిగా కొట్టుకు పోయింది.

నర్సిగాడు దిగులుపడిపోయాడు.

తనకు ఇన్నాళ్ళూ కూడుపెట్టిన యిల్లు ఇలా కొట్టుకుపోవడం మొదటిది.

తను ఇప్పుడు ఇల్లు కొట్టుకుపోయినట్లు ఋజువు చేసుకోవడం ఎలా.... అనేది రెండవది.

కాని, నర్సిగాడికి ఒక నమ్మకం. తన ఇల్లు కొట్టుకుపోయిందీ నిజం కాబట్టి ఊరంతా చెబుతారనే ధైర్యం కలిగింది. కాని ఇన్నాళ్ళూ తనకు కూడుబెట్టిన యిల్లు శాశ్వతంగా కొట్టుకుపోయినందుకే వాడు ఎక్కువగా బాధపడుతున్నాడు.

మరునటిరోజు అధికార్లు వచ్చారు. జరిగిన నష్టాన్ని అంచనాలు వేశారు. తరువాత ఒకవైపునుంచి పడిపోయిన యిళ్ళ వివరాలు రాయడం మొదలుపెట్టారు. అలా రాస్తున్న అధికారులు నర్సిగాడి యిల్లు రాయలేదు. నర్సిగాడు ఏడ్చాడు, మొత్తుకున్నాడు, ప్రమాణాలు చేసాడు. వాళ్ళు నమ్మ లేదు ఊళ్ళో వాళ్ళు కొందరు చెప్పారు, అక్కడ ఇల్లు వున్నది వాస్తవ మేనని. "ఏ ఆధారాలు లేకుండా కాలువలో యిల్లు ఉన్నదంటే నమ్మి

రాయడానికి మేము గుడ్డివాళ్ళమా" అని కళ్ళు ఎర్రగాచేసి తిరిగి ప్రశ్నించారు అధికారులు. దాంతో గ్రామస్థులెవరూ మాట్లాడలేదు.

ఇప్పుడు నర్సిగాడి దుఃఖం చెప్పనలవి కాదు. కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు.

గుండెలు బరువుగా ఉన్నాయి.

మనసు చికాకుగా ఉంది.

అస్తవ్యస్తమైన ఆలోచనలతో-

నిరాశా, నిస్పృహలతో-

మనిషి కూలిపోయాడు.

ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని మోసంచేస్తూ, డబ్బు సంపాదిస్తున్న నర్సిగాడి పాపం పండి ప్రకృతి చేతిలో ఘోరంగా మోసపోయాడు.

ఇది వాడికి సరైన గుణపాఠం.

**